

# ఎన్నారై ముచ్చట్లు

–సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

## 15. తరగతులు - గతులు

మొట్టమొదట ఆదిమానవుడిగా వున్నప్పుడే, మనిషి తన మనుగడకు ఒంటరిగా బ్రతకటం కష్టం అని అర్థం చేసుకున్నాడు. సింహాలు, పులులూ మొదలైన క్రూరమృగాలు, ఆవులూ గొర్రెలూ మేకలు మొదలైన బలహీనమైన జంతువులను వేటాడి చంపేసి తింటుంటే తన ఒంటరి బ్రతుకెంత ప్రమాదకరమైనదో గ్రహించాడు. మందలుగా జీవిస్తూ, కేవలం ఆ సంఘటిత బలంవల్ల ఎలా క్రూరమృగాల బారినిండీ తప్పించుకుంటున్నాయో చూశాడు. జంతువుల జీవనసరళి నించీ ఎన్నో మంచి విషయాలు నేర్చుకుని పాటిస్తున్న ఆదిమానవడు, తనూ అదే పద్ధతిలో చుట్టూ వున్న కొంతమంది మనుష్యులని కలుపుకుని సంఘజీవి అయాడు. అలా మనుష్యులకు మనుష్యులు, కుటుంబాలకి కుటుంబాలు దగ్గరై ఒంటరిగా దొరకని ధైర్యాన్నీ, శౌర్యాన్నీ మందీమార్బలం ద్వారా సంపాదించుకున్నారు. సమాజాలు ఏర్పరచుకున్నారు. ఈ హైటెక్ రోజుల్లో మనం 'టీం వర్క్' అంటాము కదా, అదే ఆనాటి మానవుడికే కాక, ఈనాటి మన మనుగడకి కూడా రక్షణ అయింది.

బాగుందయ్యా, అంత గొప్ప సంఘజీవులం మరెందుకిన్ని విభజనలు చేసుకుని కొట్టుకుచస్తున్నాం? మానవమనుగడనే పణంగా పెడుతున్నాం? నేను కులం, మతం, ప్రాంతం, రంగు మొదలైన ప్రమాదకరమైన విభజన భజనల గురించి చాల వ్యాసాలు వ్రాశాను. అందుకని ఇక్కడ వాటిని పేర్కొనటమే తప్ప వివరంగా వాటి జోలికి పోను. ఈ వ్యాసం ఉద్దేశ్యం కూడా అదికాదు.

కాకపోతే ఆ గీతలు ఎలా ఎక్కడెక్కడ వున్నాయో క్లుప్తంగా చూద్దాం. అవి వద్దనుకున్నా, కొంతమంది వాటినెలా అపార్థం చేసుకుని సమాజానికెంత ద్రోహం చేస్తున్నారో చూపిద్దామని మాత్రమే చెప్పవలసి వస్తున్నది.

మను ధర్మశాస్త్రంలో నాకు నచ్చినవి బహుకొద్ది మాత్రమే. నచ్చనివెన్నో వున్నా వ్యక్తిగత నమ్మకాలతో వ్యాసం నడపటం భావ్యం కాదు కనుక అవిక్కడ అనవసరం.

ఆయన వాడిన మాట ‘చతుర్వర్ణాలు’. చాలమంది అన్నీ తమకే తెలుసన్నట్టుగా ప్రచారం చేస్తున్న నాలుగు కులాలు కాదు. నాలుగు వర్ణాలు. ఆనాడు, అంటే క్రీస్తు శకం ప్రారంభానికి రెండు వందల సంవత్సరాలకు కొంచెం ముందూ వెనుకగా, సమాజంలోని ప్రజలని వారి వృత్తులనిబట్టి నాలుగు వర్ణాలుగా చూపించిన మను ధర్మ శాస్త్రం నెమ్మదిగా రూపుదిద్దుకుంది.

వారివారి వృత్తులను బట్టి ఈ వర్ణ విభజన జరిగింది. ఈనాడు ఒక పసిపాప పుట్టగానే, ఒక పేరుతో పాటూ, పుట్టుకనిబట్టి కులమూ మతమూ ఇస్తున్నాం. ఈ వర్ణాలనే కులాలుగా చెప్పుకుంటూ, మనలోమనమే విభజన చేస్తున్నాం. ఎప్పుడైతే కులం పుట్టిందో, అప్పుడే మనుష్యుల్లో వ్యాకులం మొదలైంది.

చదువుకుని తమ జ్ఞాన సముపార్జనని ఇతరులకి పంచిపెట్టేవారు ఒక వర్ణం, బ్రాహ్మణులు. ప్రజలని

దక్షతతో రక్షణనిస్తూ పరిపాలించేవారు రెండవ వర్ణం, క్షత్రియులు. ఆ ప్రజలకి కావలసిన అన్ని నిత్యావసరాలని తెచ్చి సరసమైన ధరలకు అందించేవారు మూడవ వర్ణం, వైశ్యులు. తమ కాయకష్టంతో ప్రజలకి కావలసిన ధాన్యాలు, కూరగాయలూ, నిత్యావసర సామానులు తయారు చేసేవారు నాలుగవ వర్ణం, శూద్రులు.

వీరిలో ఎవరూ ఎక్కువా కాదు, తక్కువా కాదు. ఈ నాలుగు స్థంభాలూ లేకపోతే మనిషి మనుగడే కూలిపోతుంది.

ఈ నాలుగు వర్ణాలని పూర్తిగా అపార్ధం చేసుకుని, స్వలాభం కోసం అర్థంలేని కుల నిర్మాణం చేసుకుని, మనల్ని మనమే విభజించుకుని విడిపోవటం మన ఖర్మ. ఈనాటికీ హీనంగా కొట్టుకు చావటం మన దురదృష్టం.

ఈనాడు ప్రపంచమంతటా ఎన్నో దేశాల్లో చేస్తున్న పెద్ద వ్యాపారాలు చూస్తుంటే, వాళ్ళు ఈ చతుర్వర్ణాల మను సిద్ధాంతం అక్షరాలా పాటిస్తున్నారనిపిస్తుంది. మైక్రోసాఫ్ట్, టొయోటా, నిస్సాన్, డెల్, బోయింగ్, శామ్సంగ్, టాటా, ఇన్ఫోసిస్.. ఏ కంపెనీ అయినా సరే, ఈ నాలుగు వర్ణాలూ పాటిస్తూనే వున్నాయి. ఉంటాయి

అదెలాగో, ప్రపంచమంతటా కంపెనీలు ఎలా నడుస్తున్నాయో చూద్దాం.

కంపెనీలోని మేథావులు (మొదటి వర్ణం) కంపెనీ మనుగడ కోసం, ఏయే వస్తువులు చేయాలి, లాభాల కోసం ఎలా చేయాలి అని ఒక గట్టి ప్రణాళిక తయారుచేస్తారు. (మార్కెట్ రీసెర్చి, ప్రాడక్ట్ డెవలప్మెంట్ అండ్ ప్లానింగ్).

కంపెనీలోని నాయకులు (రెండవ వర్ణం) అవి తయారుచేయటానికి కావలసిన సౌకర్యాలందజేసి, ఆ ప్రణాళికని అనుకున్నట్టుగా పూర్తిచేసి లాభాల్లోకి నడిపిస్తారు. (సీఈఓ, ఇతర ఎగ్జిక్యూటివ్ మానేజ్మెంట్ నించీ క్రింద మేనేజ్మెంట్ దాకా).

కంపెనీలోని కొనుగోలు విభాగం (మూడవ వర్ణం) ఉత్పత్తికి అవసరమైన సరుకులనీ, భాగాలనీ ఇతర వ్యాపారులనుండి లాభనష్టాలు చూసుకుంటూ కొనుగోలుచేస్తారు. (సప్లై చైన్ అండ్ అవుట్సోర్సింగ్).

కంపెనీలోని కార్మికులు (నాలుగవ వర్ణం) వారి రకరకాల నిర్మాణ నైపుణ్యంతో చేయవలసిన కార్లనూ, విమానాలనూ, కంప్యూటర్లనూ, ఇతర మెషీన్లనూ తయారుచేస్తారు. (ప్రొడక్షన్ అండ్ లాజిస్టిక్స్ వర్కర్స్).

ఈ రకంగా ఇక్కడ ఆ నాలుగు వర్ణాలూ కలిసి పనిచేస్తేనే కంపెనీ నడుస్తుంది. ఇందాక చెప్పినట్టు ఒకరు ఎక్కువా కాదు. ఇంకొకరు తక్కువా కాదు. ఈ నాలుగు వర్ణాలూ తమ పనులు సవ్యంగా చేస్తేనే, ఆ కంపెనీ నిలబడుతుంది. లాభాలలోకి వెడుతుంది. లేదా మూసేయవలసి వస్తుంది.

నేను చేసిన పరిశీలనలో ఇంకొక సరదా విషయం కూడా వుంది. మన దేశంతో పాటు యూరోపియన్ దేశాల్లోనూ, ఆసియా దేశాల్లోనూ చాలమంది ఇంటి పేర్లు వారి వృత్తులను బట్టే వచ్చాయి. భారతదేశంలో చూస్తే నేతి సుబ్బారావు, బెల్లం అప్పారావు, ఫరూక్ ఇంజనీర్, నారి కంట్రాక్టర్, నానీ పల్కీవాల మొదలైన పేర్లు మనకి తెలుసు. అలాగే యూరోపియన్లలో జేమ్స్ కుక్, పెర్రీ మేసన్, ఆలివర్ గోల్డ్ స్మిత్, డాన్ కార్పెంటర్, ఎలిజబెత్ టైలర్, జిమ్ బేకర్, ఎర్ల్ స్టాన్లీ గార్డనెర్ ఇలా ఎన్నో చూడవచ్చు. కొన్ని చైనీస్ పేర్లలో కూడా షి (చరిత్రకారుడు), జి (లైబ్రేరియన్), క్యు (స్టోర్ మేనేజర్), ట్యు (కసాయి), చ్యు (వంటవాడు), ఇలా ఎన్నో చేసే వ్యాపారపరమైన పేర్లు కనిపిస్తాయి.

ఇలాటి వర్ణాల పేర్లతో సహా, కులాలతో పేర్లూ, మతాలతో పేర్లూ, ప్రాంతాలతో పేర్లూ కూడా మామూలే! మరి ఇలాటి పేర్లు ఫలానా వాళ్ళు ఫలానా అనే ఒక్క గుర్తింపు కోసమేనా? ఒకప్పుడు అవును. ఇప్పుడు కాదు. నేతి సుబ్బారావుగారి అబ్బాయి నేతి అశోక్ నేతి వ్యాపారం చేయకుండా డాక్టరవచ్చు. ఎర్ల్ స్టాన్లీ గార్డెనర్ తోటరాముడు కాకుండా పుస్తకాలు వ్రాసుకుని పెద్ద పేరు సంపాదించాడు. షియాన్ చ్యు చైనాలో పెద్ద మాన్యుఫాక్చరింగ్ కంపెనీకి సియీవో అయాక వంటలు చేసే అవసరం రాలేదు.

నేను గుంటూరులో చదువుకునే రోజుల్లో ఆల్బర్ట్ వెంకటేస్వర్లు అని ఒకతనుండేవాడు. అతను మతం మార్చుకుని ఆల్బర్ట్ తగిలించుకున్నాడుగానీ వెంకటేశ్వరస్వామిగారిని వదల్లేదు. అతనికి మరి ఇటు శ్రీనివాసూ, అటు ఏసూ ఇద్దరి సహాయ సహకారాలూ కావాలి కదా! ఇద్దరు పెళ్ళాల ముద్దుల మొగుడవటం కోసం ఇస్లాం మతం తీసుకున్న ఆనాటి సినీనటుడు ధర్మేంద్ర ధర్మేంద్రుడే! ఇలా ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇవెంతగా మారిపోయాయంటే ఇలాటి గుర్తింపులు అసలు అవసరమా అనిపిస్తుంది కూడాను.

విమానాశ్రయంలో కూర్చున్నప్పుడు మనుష్యులు, భవంతులు, విమానాలు, కార్లు... ఇలా ఎన్నో అక్కడ చూస్తుంటాం. విమానం పైకెగిరాక భూమి మీద వున్న మనుష్యులే కాదు, భవంతులు, కార్లతో పాటు పెద్ద విమానాశ్రయాలు కూడా కంటికి కనపడవు. మనం ఇంకా ఎత్తుకు వెళ్ళి అక్కడనించీ చూస్తే ఎవరూ కనపడనప్పుడు, భూమి మీద ఎవరు ఎవరైనా ఒకటే కదూ! అలాగే మన దృక్పథం కూడా మారాలేమో!

ఇంకా ఎత్తుకు వెడితే అక్కడి నించి మనకి కనపడేవి రెండే రెండు!

ఒకటిః పొలాలు, చెట్లూ వున్న చోట ఆకుపచ్చగానూ, కొండలున్న చోట గోధుమ–పచ్చ రంగుల్లోనూ, వాటి మీద మంచు వుంటే తెల్లగానూ వున్న భూమి.

రెండుః నదులూ, సముద్రాలూ వున్న చోట నీలంగా కనపడే నీరు.

అవి చూస్తుంటే మనుష్యుల విభజన మీద ఇంకొక భావన వచ్చింది నాకు.

కార్ల్ మార్క్స్ పేరు వినేవుంటారు. ఆయన సిద్ధాంతాలతోనే వచ్చింది మార్క్సిజం. మార్క్సిస్ట్ సిద్ధాంతం. ఈనాటి మార్క్సిస్ట్ రాజకీయ పార్టీలుగానీ, వారి 'కొట్టేయ్, నరికేయ్, చంపేయ్' సిద్ధాంతాలతోగానీ ఏమీ సంబంధం లేని అసలు సిసలైన మార్క్సిజం. నాకాయన చెప్పిన కొన్ని విషయాలు నచ్చాయి కానీ, మార్క్సిస్ట్ పార్టీ కానే కాదు. పైన చెప్పిన మా ఆల్బర్ట్ వెంకటేస్వర్లు మతంలాటిది కాదు మనమిక్కడ చెప్పుకోబోయేది.

మార్క్స్ కూడా మన సంఘాన్ని, మనం ఆకాశం నించీ చూస్తున్న ఉదాహరణలో చెప్పినట్టుగానే, రెండు తరగతులుగా విభజించాడు. పచ్చగా వున్న ధనవంతులు (హేవ్స్), నీలం కాలర్ల చాలీచాలని జీతాల పనివాళ్ళు (హేవ్ నాట్స్) అని. నా చిన్నప్పుడూ, కుసింత పెద్దప్పుడూ మామూలుగా తెలుగులో వాటి అర్థం చూసి ఓహోఁ అని వదిలేశాను. కానీ ఇంకొంచెం పెద్దయాకనే ఆ మాటలకు అసలు అర్థం పూర్తిగా అర్థం కాలేదు. ఈనాటి ప్రపంచ పరిస్థితులు సమగ్రంగా ఆకళింపు చేసుకుంటూ చూస్తుంటే, ఇప్పుడు ఆయన చెప్పినదేమిటో స్పష్టంగా తెలుస్తున్నది. ఎంత బాగా చెప్పాడు అని ఆశ్చర్యం వేస్తుంది. ముఖ్యంగా నాకు బాగా తెలిసిన రెండు దేశాలు అమెరికా, భారతదేశాల్లో ఈ తేడా బాగా కనిపిస్తుంది.

మార్క్స్ సిద్ధాంతం ప్రకారం, డబ్బున్నవాళ్ళు అంటే గొప్ప ధనవంతులు. అవసరమున్నా లేకపోయినా, ఏది కావాలనుకున్నా, వద్దనుకున్నా అది కొనగలిగే స్థోమత వున్నవాళ్ళు. డబ్బులు లేనివాళ్ళు అంటే, మన తెలుగు సామెతలో చెప్పినట్టు, రెక్కాడితే కానీ డొక్కాడనివాళ్ళు. మార్క్స్ మరి మధ్య తరగతి మందహాసాల గురించి సిద్ధాంతపరంగా అంతగా పట్టించుకున్నట్టు లేదు.

ధన మూలం ఇథం జగత్ అన్నారు పెద్దలు.

దాన్నే ఆంగ్లంలో "Money, money, money! It's a rich man's world" అన్నారు నా కెంతో ఇష్టమైన గాయకులు ABBA.

ఇక్కడ గమ్మత్తు ఏమిటంటే, ఈ ధనమే విపరీతంగా వుంటే మనం పైన అనుకున్న కులం, మతం, ప్రాంతం మొదలైన గీతలన్నీ ఇట్టే మటుమాయం అయిపోతాయి.

నిజంగానా? అంటే వాళ్ళకా విభజనలు వుండవా? కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలూ, వేషాలూ, రంగులూ.. ఇంకా వెంటాడుతూనే వుంటాయా? విమానంలోలాగానే ముప్ఫైఐదు వేల అడుగుల ఎత్తున వెడుతున్నప్పుడు, భూమి మీద మనుష్యులతో పాటు అవి కూడా కనుమరుగై పోతాయా?

ఎలా మాయమవుతాయి? విమానం ఎంత ఎత్తున ఎగురుతున్నా, భూమి మీదకి దిగాలి కదా మరి!

అవి వుండటం, వుండకపోవటం వారి అవసరాలనుబట్టీ, స్వలాభాలనుబట్టీ వుంటుంది. అవి లేనట్టూ నటిస్తూ అవసరార్థాన్నిబట్టి వాటినే ప్రేమిస్తూ, అవి వాడుతూనే వుండటం చూస్తూనే వున్నాం కదా! మన రెండు తెలుగు రాష్ట్రాల

రాజకీయ నాయకుల ప్రవర్తనా, ఈనాటి అమెరికాలో కరుడుగట్టిన నియంత పాలనా చూస్తే ఇదేమిటో మీకే అర్థమవుతుంది. ఇప్పుడు 'కులమేరా అన్నిటికీ మూలం'!

డబ్బనే కత్తికి రెండు వేపులా పదునుంటుంది మరి! అంటే ఆ పదును కత్తితో తీయటి బంగినపల్లి మామిడిపండుని ముక్కలుగా కోసి గూఢ మిత్రులకు పెట్టవచ్చు, గాఢ శత్రువుల పీకలూ తెగ్గొట్టవచ్చు.

ఒకవేపు ఆపదల్లో వున్నవారికి సహాయం చేయటం, బీదవారికి చదువులు చెప్పించటం, తగిన ఆహారం ఇవ్వటం, అవసరమైన ధన, వైద్య సహాయం చేయటంలాటివెన్నో మానవతా దృక్పథంతో చాలమంది చేస్తూనే వున్నారు. వారిని దినవారీ చూస్తూనే వున్నాం. ఆ పేర్ల లిస్ట్ ఇవ్వనఖ్ఖర్లేదు. వారెవరో మీకూ తెలుసు.

కాకపోతే మనం ఈ వ్యాసంలో చెప్పుకుంటున్న సమస్య ఆ రెండో పక్కన వున్న పదును. ఆ పదునుకి నాకు ముఖ్యంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి నాకు డబ్బుంది నన్నెవరూ ఏమీ చేయలేరు అనే అహంకారం, ధనమదం. రెండవది పదవుల కోసం పోరాటం. మూడవది 'ఇంకా కావాలి' అనే స్వార్ధం, దురాశ.

ఆ విషయాన్ని కొంచెం తీరిగ్గా పరిశీలిస్తే కొన్ని నిజాలు బయటపడతాయి.

ఈ మూడూ ఒక్కొక్కప్పుడు వేరువేరుగానూ, మిగతా సమయాల్లో కలిసిగట్టుగానూ సాటి ప్రజలను స్వాహా చేస్తుంటాయి. ఇలాటివారికి ధనం అనేది అహంకారాన్ని ఇస్తుంది. పదవులు కోరుకుంటుంది. స్వార్ధం పెంచుతుంది. సాటి మానవుల మీద ప్రేమని చంపుతుంది. అసహ్యాన్ని పెంచుతుంది. మనిషికీ మనిషికీ మధ్య దూరాన్ని పెంచుతుంది. సమాజాన్నీ, దేశాన్నీ బలి తీసుకుంటుంది. ధనవంతులని ఎక్కువ ధనవంతులని చేస్తుంది. పేదవారిని పేదవారిగానే వుంచుతుంది. లేదా చంపేస్తుంది.

ఆరోజుల్లో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ, మొగలాయీల భారతదేశ దురాక్రమణ, హిట్లర్ జ్యూయిష్ వారి ఊచకోత, ఈరోజుల్లో అమెరికా అధ్యక్షుడి నిరంకుశపాలన, శ్వేతజాత్యహంకారం, విదేశంలో ఒక బార్‌లో పనిచేసే సాధారణ వనిత భారత ప్రధానమంత్రినే జేబులో వేసుకుని, భారతదేశ ప్రగతినే పణంగా పెట్టి, విభజించి పాలించి ప్రపంచంలోనే పెద్ద ధనవంతురాలయిపోవటం, తెలుగు రాష్ట్రాల్లోనూ అదే పద్ధతిలో కులం కార్డు ఉపయోగించి జనాన్ని భ్రమలో పెట్టి కోటానుకోట్లు సంపాదించటం, మన చరిత్ర మరచిపోయి మతం కార్డు వాడి రాజకీయ ప్రయోజనాల కోసం తురుష్కరుల కాళ్ళ దగ్గర చేరి పూజలు చేసి వారి ఓట్లు సంపాదించటం. ఇలా ఎన్నో ఉదాహరణలు సరిగ్గా చూసేవారికి, భూతద్దం లేకుండానే కనిపిస్తాయి.

అలానే బాగా డబ్బున్న సినిమా నటుడు నడిరోడ్డులో మనుష్యుల మీదనించీ కారు పోనిచ్చి చంపినా కేసు వుండదు. ఒక రాజకీయ నాయకుడు రైతుల కడుపులు కొట్టి, కొన్ని వేల ఎకరాల భూమిని మింగేసినా అది ఒక సమస్య కాదు.

ఒక డబ్బున్న గొప్పవాడో, వాడి కొడుకో అర్ధరాత్రి ఒకమ్మాయిని మానభంగం చేసినా ఫరవాలేదు. బాబాలు, స్వామిజీలు పెద్ద వాళ్ళనందర్నీ చేతుల్లో పెట్టుకుని నిత్యానందాలు చేసినా తప్పేమీ లేదు. పెద్ద పెద్ద హిందీ సినిమా నటులు మతపరంగా మన శత్రుదేశానికి పూర్తి మద్దతు ఇచ్చి, వారికి భజనలు చేస్తుంటే అది దేశద్రోహం కాదు.

ఇవన్నీ కార్ల్ మార్క్స్ చెప్పిన ఒక పక్క హేవ్స్ కథలయితే, ఇంకొక పక్క హేవ్ నాట్స్ సంగతి చూద్దాం. కష్టజీవుల కథలన్నీ అందరికీ తెలిసినవే అయినా, నన్నెంతో కలచి వేసిన రెండే రెండు ఉదాహరణలు చెప్పి ఈ వ్యాసం ముగిస్తాను.

మనకి అన్నం పెట్టేవాడు రైతు. ఆ చిన్నకారు రైతు పండించే బియ్యం, గోధుమలు, పప్పులు, కూరలు.. ఏవైనా సరే, అతని దగ్గర కొనుగోలు చేసే ప్రభుత్వమైనా, పెద్ద సూపర్‌బజారు వ్యాపారులైనా, ఇతర మధ్యవర్తులు, భూస్వాములూ రైతు కష్టాలకి తగ్గ ధర ఇవ్వటంలేదు. వారి దగ్గర ఎంత పిండాలో అంతా పిండి వారి దగ్గర సరుకు కొంటారు. మధ్యవర్తులు మనకి అమ్మే ధరలు మాత్రం ఆకాశానికి అంటుతాయి. కష్టమొకడిదీ, లాభమింకొకడిదీ. అంతేకాదు. వానలు, వరదలు వచ్చి పంటలు కొట్టుకుపోతుంటే ఆ నష్టమూ చిన్నకారు రైతుదే. రోజురోజుకీ పెరిగే ఖర్చులూ, విత్తనాల ఖర్చులూ కూడా రైతువే. రైతుల ఆత్మహత్యలు ప్రపంచ దేశాల్లో ఒక్క భారతదేశంలోనే  ఎక్కువ. అన్నపూర్ణ ఆంధ్రదేశంలో, అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంకా ఎక్కువ. ఎందుకని? ఈ దోపిడికి కారకులెవరు? మళ్ళీ పై వర్గం వారే!

అలాగే అమెరికాలో మాదకద్రవ్యాల అమ్మకం ఎక్కువ. ఆ మాఫియాలని కొలంబియా, మెక్సికోలాటి దేశాల సహాయంతో నడుపుతున్నది అమెరికాలోని శ్వేతజాతి ధనవంతులే! ఎన్నో బిలియన్ల డాలర్ల వ్యాపారం. వాళ్ళందరూ పెద్ద భవనాల్లో అన్ని సుఖాలూ అనుభవిస్తూ బాగానే వుంటారు. కానీ పట్టుబడి జైలుకి వెళ్ళేవారు మాత్రం రోడ్డు మీద చిల్లర డబ్బుల కమిషన్ కోసం అమ్మకాలు చేసే నల్లవారు, మెక్సికన్స్. వారిలో చాలమంది ఎన్నో సంవత్సరాలుగా జైళ్ళల్లో మగ్గుతున్నారు. చిన్న చేపల్ని పెద్ద చేపలు తినటం అంటే ఇదే కాబోలు.

ఏ దేశపు గొప్పతనమైనా అక్కడ ఎంతమంది బిలియనీర్లు, మిలియనీర్లు వున్నారన్న కొలమానం మీద ఆధారపడదు.

కనీసం తినటానికి తిండి లేక బాధపడుతున్న కటికపేదవారున్నంతవరకూ ఏ దేశమూ గొప్పదవదన్న నిజాన్ని మనం గుర్తించటం అవసరం!

○ ○ ○

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS